రీ సర్వే పనుల వేగవంతానికి చర్యలు

కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకం కింద చేపట్టిన మూడవ దశ రీసెర్వే పనులు వేఘవంతం చేసి డిసెంబర్ నెల చివరి నాటికి పూర్తిచేసేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి..రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో కలిసి గురువారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టరు ఎస్. ఇలక్కియ, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులతో కలిసి హాజరయ్యారు. రెవిన్యూ అంశాలకు సంబంధించి రీ సర్వే ప్రక్రియ పనులు, జాతీయ రహదారులకు, మార్క్‌ఫెడ్‌కు సంబంధించి గోదాములకు అవసరమైన భూసేకరణ, అసైన్డ్ భూముల పట్టాల పంపిణీ, వ్యవసాయ శాఖకు సంబంధించి తుపాను ప్రభావంతో నష్టపోయిన పంటల నమోదు వివరాలు, ధాన్యం సేకరణ, రబీ సీజన్ సన్నద్ధత, ఎరువులు సరఫరా, మిల్లెట్స్ సాగు వివరాలు, జగనన్న పాల వెల్లువ కార్యక్రమం కింద మహిళా పాడి రైతులకు రుణాల మంజూరు, హౌసింగ్ శాఖకు సంబంధించి లేఔట్ పనులు, గృహ నిర్మాణాల పురోగతి, ప్రభుత్వ శాశ్వత భవనాల నిర్మాణాలు, ఉపాధి హామీ పథకం పని దినాలు, స్వామిత్వా, జలజీవన్ మిషన్ ఇతర ప్రాధాన్య కార్యక్రమాలపై సీఎస్ జవహర్ రెడ్డి..కలెక్టర్లతో సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర భూ సర్వే పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మూడో దశ రీసర్వే కింద 16మండలాల్లో 90 గ్రామాల్లో చేపట్టడం జరిగిందన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్, డ్రాఫ్ట్ రిజిస్ట్రేషన్ వంటి అన్ని పనులను ఈనెల చివరి నాటికి పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు జెడ్పీ సీఈవో ఎ రమణా రెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్ సూర్యప్రకాశరావు, డీపీవో భారతి సౌజన్య, డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి, ఏడి సర్వే బి లక్ష్మీ నారాయణ, డీసీవో దుర్గాప్రసాద్, అధికారులు తదితరులు హాజరయ్యారు.

అంగన్వాడీలను నమ్మించి మోసం చేస్తారా ?

విశాలాంధ్ర - జగ్గంపేట : అంగన్వాడీలను నమ్మించి మోసం చేస్తారా అని ముఖ్యమంత్రి జగన్‌ను జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర ప్రశ్నించారు. అంగన్వాడీలు తమ డిమాండ్ల సాధన కోసం ఒక వైపు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, మూడు రోజులుగా జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈ నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని అన్నారు. మూడో రోజు మాత్రం అంగన్వాడీ కేంద్రాలను తెరిపించాలని ప్రభుత్వం అదేశాలు ఇవ్వడంతో మండల పరిషత్, రెవిన్యూ, పంచాయతీ అధికారులు నియోజకవర్గం లోని అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగులు కొట్టి తెరిచారు. ఒక మహిళను ఇన్‌చార్జిగా నియమించి చిన్నారులకు ఆహారాన్ని వడ్డించారు. అంగన్వాడీలు చేస్తున్న నిరసనలకు సూర్యచంద్ర సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ జగన్ గత ఎన్నికల ముందు పాదయాత్ర సమయంలో వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి గద్దె నెక్కాక వారిని మోసం చేశారన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీలకు జీతాలు పెంచాలని లేకుంటే వచ్చే ఎన్నికల్లో భారీగా ఓటమి చెందుతారన్నారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె ఆగదు

విశాలాంధ్ర - మండపేట : గ్రామీణ తపాలా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేరేవరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని, సమ్మెకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తపాలా ఉద్యోగ సంఘ నాయకులు కొండ పల్లి సూర్యనారాయణ అన్నారు. బుధవారం భోజన విరామంలో సబ్ పోస్ట్ ఆఫీస్ ఎదుట గ్రామీణ తపాలా ఉద్యోగుల డిమాండ్లకు మద్దతుగా ఉద్యోగులతో కలిసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్‌పిఈ జిడిఎస్ కార్యదర్శి ఎండిఎం షరీఫ్ తమ సంఘ పిలుపుమేరకు తాను సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా డిపార్ట్మెంట్ ఉద్యోగులతో పాటు పెన్షనర్ ఉద్యోగులు మద్దతు తెలియజేయడంపట్ల గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో పోస్ట్మాన్ ఉద్యోగుల కార్యదర్శి కే ఈశ్వరరావు, జి. వెంకట్రావు, వి. గోవింద్, ఎం. అనూష, కే. అనూష, ఎస్.దుర్గాదేవి పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రాల తాళాలు బద్దలు కొడితే సహించం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : అంగన్వాడి కార్యకర్తలు లేకుండా తాళాలు బద్దలు కొడితే ఊరుకునేది లేదని సచివాలయ సిబ్బందికి తెగేసి చెప్పారు తల్లులు. అంగన్వాడీల న్యాయమైన కోర్కెల కోసం సమ్మె చేస్తుంటే అన్యాయంగా వచ్చి తాళాలు బద్దలు కొట్టకూడదని తల్లులు హెచ్చరించారు. అధికారుల ఆదేశాల మేరకు గురువారం సచివాలయ సిబ్బంది పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న కొన్ని అంగన్వాడి కేంద్రాల తాళాలు బద్దలు కొట్టి వారి తాళాలు వేశారు. మరి కొన్నిచోట్ల కేంద్రాలకు తాళాలు వేసేందుకు ప్రయత్నం చేయగా అక్కడ ఉన్న పిల్లల తల్లులు చేరుకొని తాళాలు తీయకుండా చూశారు. జీతాలు పెంపుదల కోసం వారు చేస్తున్న సమ్మె న్యాయ బద్ధ మని అంగన్వాడీలకు బాసటగా నిలిచారు. సమ్మె విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తెలియాలని సచివాలయం సిబ్బందికి తెలిపారు.

సుజాతకు అభినందనలు

విశాలాంధ్ర - తాళ్ళపూడి : ప్రముఖ యూట్యూబర్ ఈజీ ఇంగ్లీష్ బై సుజాత ఛానల్ ద్వారా ఎంతో మంది విద్యార్థులకు ఇంగ్లీష్ పాఠాలను, వ్యాకరణాన్ని ఇంగ్లీష్‌లో మాట్లాడేలా తీర్చిదిద్దుతున్న కవులూరి సుజాత తన ఛానల్‌కి 5లక్షలు పై బడి సబ్స్క్రైబర్స్ పూర్తి అయినందున ఆమెను మానవత జిల్లా ఎడ్యుకేషన్ సభ్యులు, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సుజాతను అభినందించారు. 2020 లో తన యూట్యూబ్ ను ప్రారంభించి వందలతో ప్రారంభ మైన వీక్షకులు నేడు 5 లక్షలు పైబడి ఆన్‌లైన్‌లో పాఠాలు వినడం, నేర్చుకోవడం చాలా గర్వించదగ్గ విషయం అని, గత ఏడాది యస్.ఐ, కానిస్టేబుల్ పరీక్షార్థులకు శిబిరంలో పిల్లలకు ఇంగ్లీష్ జ్ఞానాన్ని అందించిన సుజాత అభినందనీయులు అని జోడాల కొని యాడారు. వివాహమై, పిల్లలు కలిగి ఒక వైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ గ్రామీణ యువతకు మార్గదర్శిగా మారిన సుజాత గోపాలపురం నివాసి మరియు తిరుగుడుమెట్ట సచివాలయంలో ప్రొటెక్షన్ సెక్రటరీగా పని చేయడం గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయంలో అభినంద నలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో గురువారం నాడు జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ స్కూటర్లు ఢీకొన్న గా ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. మృతుడు దొమ్మేరు గ్రామానికి చెందిన కల్లేపల్లి కృష్ణ(43)గా గుర్తించారు. పట్టణ పోలీసులందించిన వివరాల ప్రకారం కృష్ణ పొలం పనులను ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా మృతుడు దొమ్మేరు శివారులోని రాజు గారి హోటల్ సమీపంలోనికి రాగా అతివేగంగా వస్తున్న లారీ వెనుక నుండి ఢీకొనడంతో కృష్ణ తలకుబలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.మృతుడు కృష్ణకు భార్య, ఒక కుమారుడు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా పట్టణ ఎస్సై బి. దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అన్నదాతలను ఆదుకోవాలి : సీపీఐ ధర్నా

విశాలాంధ్ర - కాకినాడ : మిచౌంగ్ తీవ్ర తుపానుతో నష్టపోయిన వరి, ఆక్వా, ఉద్యాన రైతులను ఆదుకోవాలని కోరుతూ సీపీఐ కాకినాడ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక జిల్లా పరిషత్ సెంటర్ వద్ద గంటపాటు ధర్నా నిర్వహించారు. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నశించాలని, జాతీయ విపత్తు ప్రకటించాలని ,రైతులను ఆదుకోవాలని పార్టీ శ్రేణులు నినాదాలు ఇచ్చారు. అనంతరం ధర్నా నుద్దేశించి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ మిచౌంగ్ తుపానుతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ముఖ్యంగా కాకినాడ జిల్లాలో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇంత జరుగుతున్నా జిల్లాలో ఉన్న మంత్రులు, ప్రజా ప్రతినిధులు కనీసం సమీక్ష కూడా చేయలేదని, ధాన్యం కొనుగోలు చేయడంలో తీవ్ర అలసత్వం చూపించారన్నారు. ప్రజా ప్రతినిధులకు ఇసుక, భూకబ్జాల మీద ఉన్న శ్రద్ధ రైతులపై లేదన్నారు. ముఖ్యమంత్రి మాటలు కాగితాలకే పరిమితం అవుతున్నాయన్నారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల ఎకరాలకు పైగా అపార పంట నష్టం వాటిల్లిందని మధు తెలిపారు. తుపాను కరువు నష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించి రాష్ట్రానికి రూ.1000 కోట్లు తక్షణ సాయం ప్రకటించా లన్నారు. నష్టపోయిన ఆహార పంటలకు ఎకరాకు రూ.30,000, వాణిజ్య పంటలకు రూ.70,000, ఉద్యాన పంటలకు లక్ష నష్టపరిహారం ఇవ్వాలని మధు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె. బోడకొండ మాట్లాడుతూ తుపాను బీభత్సానికి రైతులు పండించిన మిర్చి, పత్తి, మొక్కజొన్న, మినుము, కూరగా యలు తదితర పంటలన్నీ పూర్తిగా నాశనమ య్యాయని అన్నారు. ఈ ధర్నాలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్డి సత్యనారాయణ, పిఎస్ నారాయణ, టి.అన్నవరం, ఎంఎస్ రామయ్య, సత్యనారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధిత రైతులకు తక్షణమే నష్టపరిహారం అందజేయాలి

కలెక్టరేట్‌ను ముట్టడించిన అఖిలపక్ష నాయకులు

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్రంలో అనావృష్టి, అతివృష్టి వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రస్తుత విపత్కర పరిస్థితిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని అఖిలపక్ష నాయకులు గురు వారం డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా అఖిల పక్ష నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాభావం, మిచౌంగ్ తుఫాన్ వల్ల రైతులు నష్టపోయారని తెలిపారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులైన తుంగ భద్ర, శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల, సోమశిల, కండలేరుల్లో గత సంవత్సరం నవంబర్ 22 నాటికి 7-43.10 టిఎంసిలు నీటి నిల్వలు ఉండగా, ప్రస్తుతం 298,64 టిఎంసిలు ఉన్నాయని తెలిపారు. రాయలసీమ జిల్లాల్లో 2.75 మీటర్లు, కోస్తా ప్రాంతంలో 1.19 మీటర్లు. రాష్ట్ర వ్యాప్తంగా 188 మీటర్లు భూగర్భ జల మట్టం తగ్గిపోయిందన్నారు. దీని ప్రభావంతో ఖరీఫ్ సీజన్‌లో 10 లక్షల హెక్టార్లలో సాగు జరగక పోవడంతో భూములు బీళ్లుగా మారిపోయాయ న్నారు. రబీ సీజన్ లోనూ వర్షాభావ పరిస్థితుల వల్ల కేవలం 25 శాతం భూముల్లో మాత్రమే రైతులు పంటలు వేయగలిగారని తెలిపారు. పర్యవసానంగా రాయలసీమలో వలసలు ప్రారంభ మయ్యా యన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో డ్రైన్లు, కాలువలు పూడుకుపోవడం వల్ల సాగు భూముల్లో నీరు నిలబడిపోతోందన్నారు. మిచౌంగ్ తుఫాన్ వల్ల దెబ్బతిన్న ఆహార పంటలకు ఎకరాకు రూ. 50 వేలు, వాణిజ్య పంటలకు రూ. 75 వేలు, ఉద్యాన పంటలకు రూ. లక్ష పరిహారం చెల్లించా లని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. రైతులు తీసుకున్న అన్ని రకాల పంట రుణాలను మాఫీ చేయాలన్నారు. కౌలు రైతులకు సెల్ఫ్ రిక్విజిషన్ పై ఇ-క్రాప్ నమోదు చేయాలని, ఇన్‌పుట్ సబ్సిడీ అందచేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఇళ్ల వేంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనంద రావు, టీడీపీ రాష్ట్ర నాయకుడు మెట్ల రమణబాబు, మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ పెచ్చెట్టి విజయ లక్ష్మి, సిపిఐ జిల్లా కార్యదర్శి కె. సత్తిబాబు, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వర రావు, జిల్లా కమిటీ సభ్యులు జి. దుర్గా ప్రసాద్, ఎన్. బలరాం, ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, పీసీసీ ఉపాధ్యక్షుడు ఎం. శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శి అయితా బత్తుల సుభాషిణి, పట్టణ అధ్యక్షుడు ఒంటెద్దు బాబీ, గెద్దం సురేష్ బాబు రైతు నాయకులు మట్టా ప్రభాకర్, యాళ్ళ బ్రహ్మానందం, దేశినీడి భాస్కర రావు, పీతల రామ చంద్ర రావు, కుడుపూడి సింహాద్రి, కుంపట్ల వరుణ్ బాబు, సీపీఐ నాయకులు పెద్దిరెడ్డి రాము, కె. రామకృష్ణ, చెట్ల సత్యనారాయణ, రొక్కాల సత్యనారాయణ, కామిరెడ్డి చంద్రరావు, సీఐటీయు జిల్లా నాయకులు దుర్గా ప్రసాద్, వి. మోహనరావు, ఏఐటీయుసీ నాయకులు కురచ నాగేశ్వరరావు నాయకత్వం వహించారు.

సచివాలయ హెల్త్ సెక్రటరీలను బదిలీ చేయాలి

విశాలాంధ్ర - కాకినాడ : మున్సిపల్, పురపాలక, నగర పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, ఇంజనీరింగ్, డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్త స్వతంత్ర సంఘాల పిలుపులో భాగంగా డిసెంబర్ 27న సమ్మె జరగనుంది. ఈ సమ్మెపై ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) కాకినాడ కమిటీ ఆధ్వర్యంలో పర్యటనలో భాగంగా గురువారం 1 సర్కిల్, 12 సర్కిళ్లలో మున్సిపల్ కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ మున్సిపల్ కార్పొరేషన్ స్మార్ట్ సిటీ కాకినాడలో తడి, పొడి చెత్త వల్ల వస్తున్న ఆదాయం, కార్పొరేషన్కు మిగులు ఆదాయం ఉన్నదని, దానిని దుర్వినియోగించకుండా కాకినాడ కార్పొ రేషన్‌లో మున్సిపల్ కార్మికులకు బ్లౌజులు కొరత అధికంగా ఉందని, కొరత తీర్చి ప్రతి నెల బ్లౌజులు తప్పనిసరిగా మంజూరు చేయాలని, పుష్ గార్డ్ బండ్లు, డస్ట్ బిన్ డబ్బాలు, వెహికల్ రిపేర్, చీపుర్లు కర్రలు కొంకేలు మొదలగు పనిముట్లు కొనుగోలు చేసి పనిముట్ల కొరత తీర్చాలని, కార్మికుల సమస్యలు పట్టించుకోవాలని ప్రసాద్ అన్నారు. అన్ని సర్కిళ్లలో మస్తార్ టైం ఒకే విధంగా ఉండేలా చూడాలని, మున్సిపల్ కార్మికులకు జాతీయ సెలవు, పండగ సెలవులు తప్పనిసరిగా మంజూరు చేయాలని, డిఎ, ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, పిఎఫ్ తనిఖీ చేసి ఎప్పటికప్పుడు కార్మికులకు తెలియజేసే విధంగా కార్యాలయంలో తగు సిబ్బందిని నియమించాలని ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు శీను, సత్యనారాయణ, కిషోర్, కుమార్, సింగంపల్లి రమణ, ముల్కి సత్యనారాయణ, బంగారు హరికృష్ణ, గంటా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అధికారులపై అంగన్వాడీల ఫిర్యాదు

విశాలాంధ్ర - కరప : కరప మండల వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీలు కరప పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై నౌదు రామకృష్ణ కు ప్రభుత్వ అధికారులపై ఫిర్యాదు చేశామని అంగన్వాడి వర్కర్ ఎస్ వరలక్ష్మి, కెఎస్ఆర్ఆర్ దుర్గ, కే సత్యవతి, కే కల్ప లత, గంగ భవాని, దుర్గా తదితరులు తెలిపారు. అంగనవాడి వర్కర్లుగా పనిచేస్తున్న తాము తమ హక్కుల సాధన కోసం సమ్మెలో పాల్గొని ఉండగా గురువారం ప్రభుత్వ అధికారులు ఎంపీడీవో కే. అప్పారావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లతో కలిసి అంగన్వాడీ కేంద్రాలకు వేసుకున్న తాళాలు పగలగొట్టి తెరిచారని, తమ అనుమతి లేకుండా కేంద్రాల్లో ఉన్న సరుకులకు బాధ్యత ఎవరు వహిస్తారని దీనిపై చట్టపరంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ ఫిర్యాదు చేస్తున్నామన్నారు.

పంట నష్టాన్ని పరిశీలించిన కేంద్ర కమిటీ సభ్యులు

విశాలాంధ్ర - కిర్లంపూడి : ఈనెల 2 నుండి 7 వరకు కురిసిన భారీ వర్షాలకు కిర్లంపూడి మండ లంలో నష్టం సంభవించిన వరి పంటలను జిల్లా పౌరసరాపరాల శాఖ డిఎం పుష్పమణితో పాటు, కేంద్ర కమిటీ సభ్యులు గురువారం పరిశీలిం చారు. మండలంలోని సింహాద్రిపురం, జగపతినగరం గ్రామాల్లో తడిసిన పంటలను పరిశీలించి, ధాన్యం శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా డిఎం పుష్పమణి మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. జరిగిన పంట నష్టాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలోఎఫ్‌టిసి, డిడి హరి, ఎఫ్ టి సి, ఎడిఎ మాధవి, ఎఎంటి విజయ, ఎఫ్‌సిఐ, శ్రీనివాస్, మండల వ్యవసాయ శాఖ అధికారిణి జోకా అమృత గ్రామ వ్యవసాయ సహాయకులు బలరాం, రామకృష్ణ, సునీతరైతులు పాల్గొన్నారు.

దళితవాడలకు మహనీయుల పేర్లు

విశాలాంధ్ర-చాగల్లు: మండల కేంద్రం చాగల్లు గ్రామంలోని కొత్తపేట దళిత వాడకు వెళ్లే రహ దారికి అంబేద్కర్ సమతా నగర్, లుంబినివనం రోడ్డుగా నామకరణం చేశారు. దళితవాడ లేదా హరిజన పేటలను అలా పిలవకుండా మహ నీయుల పేర్లతో పిలిపించుకునే విధంగా చిరునామా బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు బహుజన రచయితల వేదిక రాష్ట్ర కన్వీనర్ నేలపూరి రత్నాజీ గురువారం మీడియాకు తెలియజేశారు. ఈ బోర్డుల ఏర్పాటుకు సహకరించిన దాతలకు ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

లంక భూముల రైతులను ఆదుకుంటాం

విశాలాంధ్ర - ఆలమూరు : లంక భూముల రైతులను అన్ని విధాల ఆదుకుంటామని శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు మండ లంలోని మడికి, బడుగువాని లంక గ్రామాలకు చెందిన రైతుల సారవంతమైన లంక భూములు గోదావరి నదీ ప్రాంతంలో సంభవించే వరదల వలన నదీగర్భంలో కలిసిపోతున్నాయి. రైతుల సూచనల మేరకు ఎమ్మెల్యే చిర్ల పైప్ లైన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సహకారంతో 2 కిలోమీటర్ల మేర రూ.42 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న స్టోన్ ఫిక్సింగ్ ప్లాట్ఫారం (గ్రోయన్స్)కు గురువారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ లంక భూములను కాపాడేందుకు ప్రభుత్వం, అధికార యంత్రాంగం పూర్తిగా సన్నద్ధమైందని ఏప్రిల్ 31 తేదీ నాటికి గ్రోయిన్స్ నిర్మాణం పూర్తి చేయాలని అన్నారు. నిర్మాణపు పనులు జరిగే సమయంలో రైతులు సహకరించాలని సూచించారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఏఎంసీ ఛైర్మన్ యనమదల నాగేశ్వర రావు, సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి సత్తిబాబు, వైసీపీ గ్రామ కమిటీ ప్రెసిడెంట్ వీరా రాజు, కటారి గంగరాజు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా మున్సిపల్ షాపుల వేలం

15 నుండి 16 వేల వరకు పెరిగిన షాపుల అద్దె

విశాలాంధ్ర - మండపేట : మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మున్సిపల్ షాపుల వేలం పాటలు ఉత్కంఠ భరితంగా సాగాయి. పట్టణంలోని మెయిన్ రోడ్డు ఆనుకుని ఉన్న 13 మున్సిపల్ షాపులకు, సర్దార్ వేగుళ్ళ వీర్రాజు మున్సిపల్ మార్కెట్ లోని వెంకటేశ్వర స్వామి ఆలయం వెనక ఉన్న నాలుగు షాపులతో కలిపి మొత్తం 17 షాపులకు మున్సిపల్ కమిషనర్ రామ్ కుమార్ వేలం నిర్వహించారు. 17 షాపులకు వేలం నిర్వహించగా అందులో 10 షాపులను హెచ్చు పాటదారులు దక్కించుకున్నారు. మిగిలిన ఏడు షాపులు వాయిదా పడ్డాయి. ఈ వేలంలో 10 షాపులు పాటదారులు దక్కించుకోగా మరో 7 షాపులు వాయిదా పడినట్లు కమిషనర్ రామ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పాటదారులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌రావు సేవాగుణాన్ని కొనసాగించాలి

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం: తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తండ్రి నున్న చంద్రశేఖరరావు ఇటీవల మరణించిన సంగతి విదితమే. పితృవియోగంతో బాధపడుతున్న నున్న తిరుమల రావును వెనుకబడిన తరగతుల సంక్షేమం, ప్రజా సంబంధాలు, సమాచార, సినిమాటోగ్రఫి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాజానగరం శాసన సభ్యులు జక్కంపూడి రాజా, రాజమండ్రి రూరల్ ఎం.ఎల్.ఏ గోరంట్ల బుచ్చియ్య చౌదరి పరామర్శించారు. గురువారం కాతేరులోని తిరుమలరావు స్వగృహంలో నున్న చంద్రశేఖరరావు పెద్దకార్యం కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చెల్లుబోయిన వేణు, ఎం.ఎల్.ఏ జక్కంపూడి రాజా, బుచ్చియ్య చౌదరి పేదలకు దుప్పట్లు పంచిపెట్టారు. తిరుమల విద్యాసంస్థలు స్థాపించి ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయిలోకి రావడానికి తోడ్పడుతున్నారని, తండ్రి ప్రోత్సాహంతో ఎన్నో రక్తదాన శిబిరాలు, ఉచిత అంబులెన్స్ సౌకర్యాలు పెట్టి ఎంతో మంది పేదవారికి సేవచేస్తున్నారని అన్నారు. మాజీ ఎం.ఎల్.సి ఆదిరెడ్డి అప్పారావు, బూరుగుపల్లి శేషారావు, గోపాలకృష్ణ, బత్తుల రామకృష్ణ, చెరుకూరి వీర్రాజు, గన్ని కృష్ణ, బొడ్డు వెంకటరామన్న చౌదరి, ఇమ్మని రామకృష్ణ, ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ పలువురు వైద్యులు ప్రముఖులు పాల్గొని నివాళులు అర్పించారు.

విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

డాక్టర్లు రోగుల పట్ల ప్రేమతో మెలగాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: ప్రతి డాక్టర్ బాధ్యతాయుతంగా పనిచేసి రోగులపట్ల అన్యోన్యంగా ఉండాలని దేవరపల్లి మండల పరిషత్ అధ్యక్షుడు కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలో దేవరపల్లి యాదవులు గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యానికి ఎంతో ఖర్చు చేస్తున్నదని ప్రతి రోగికి ఉచితంగా మందులు వైద్యం చేయవలసిన బాధ్యత డాక్టర్లపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి పి హెచ్ సి కి సంబంధించిన సమస్యలను ఎంపీపీ దుర్గారావు అడిగి తెలుసుకున్నారు. యాదవోలు పీహెచ్సీకి ఇద్దరు డాక్టర్లు ఉండవలసి ఉండగా ప్రస్తుత ఒక్కరే ఉన్నారని ఎంపీపీ దృష్టికి తెచ్చారు. మరో డాక్టర్ కూడా త్వరలో పిహెచ్సికి వస్తారని తెలిపారు. ఈ సమావేశంలో దేవరపల్లి పిహెచ్సి డాక్టర్ సాంబశివరావు డాక్టర్ సంజీవ్ గౌరీపట్నం పిహెచ్సి డాక్టర్లు డాక్టర్ మౌనిక డాక్టర్ సతీష్ యాదవోలు పీహెచ్సీ డాక్టర్ హరి చందన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిహెచ్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం ఎర్నగూడెం సంగాయి గూడెం గ్రామాలలో తుఫాను నష్టం పరిశీలించడానికి కేంద్ర ప్రభుత్వ అధికార బృందం గురువారం పర్యటించింది. తుఫాను వలన ఎర్నగూడెంలో అరటి తోటలు, సంగాయిగూడెంలో ఇల్లు పడిపోయాయి. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రి శాఖ అధికారి మహేంద్ర చండీలి కేంద్ర ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి బి. హేత్సింగ్ పరిశీలించారు. నష్టం ప్రభుత్వానికి నివేదిక ద్వారా తెలియజేస్తామని తెలిపారు. కేంద్ర బృందం వెంట కొవ్వూరు ఇన్‌చార్జి ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్, దేవరపల్లి తహసీల్దార్ రామకృష్ణ, రైతు సంఘం నాయకుడు కరుటూరి శ్రీనివాస్, స్థానిక వైసీపీ నేత సుంకపల్లి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి విజయ్, మండల ఉద్యానవనాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఇచ్చిన మాట తప్పిన సీఎం జగన్

విశాలాంధ్ర-కొవ్వూరు : అంగన్వాడీ వర్కర్లకు 26వేలు రూపాయల గౌరవ వేతనంతో పాటు సుప్రీంకోర్టు చెప్పిన విధంగా గ్రాడ్యుటీని చెల్లించాలని, అంగన్వాడీల న్యాయపరమైన డిమాండ్ల అమలుకు జనసేన పార్టీ సంపూర్ణంగా మద్దతుగా ఉంటుందని మాజీ శాసనసభ్యులు, కొవ్వూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి టీవీ రామారావు పేర్కొన్నారు. బుధవారం నుంచి కొవ్వూరు ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా అంగన్వాడి వర్కర్లు, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేస్తున్న శాంతియుత సమ్మె కార్యక్రమానికి, మోకాలి పై సమ్మె చేస్తూ జనసేన పార్టీ తరఫున పాల్గొని కొవ్వూరు జనసేన పార్టీ ఇన్‌చార్జి టీవీ రామారావు సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కొవ్వూరు మండల యువత అధ్యక్షులు గంగుమళ్ల స్వామి, గంద్రోతు పవన్, కొవ్వూరు పట్టణ మహిళా అధ్యక్షురాలు కే నవ్య, సలాది వేణు మాధవి, వీర మహిళ వెంకటలక్ష్మి,పూటి రమేష్, జనసేన నాయకులు, వీర మహిళలు జన సైనికులు పాల్గొన్నారు.

తాళాలు బద్దలు కొట్టి అంగన్వాడీ కేంద్రాల స్వాధీనం

విశాలాంధ్ర - సీతానగరం: తాళాలు బద్దలు కొట్టి అంగన్వాడీ కేంద్రాలను పంచాయతీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం అంగన్వాడీ సిబ్బందికి వేతనాలను చెల్లించాలని, కేంద్రాలను మూసివేసి నిరసన తెలుపుతున్న సంగతి తెలిసింది. దీనితో మండలంలో గల 69 అంగన్వాడీ కేంద్రాలను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీస్, విఆర్ఓ ఆధ్వర్యంలో గురువారం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రెటరీ, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తాళాలను బద్దలు కొట్టి అంగన్వాడీ కేంద్రాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ప్రస్తుతం ఆయా కేంద్రాలలో ఉన్న స్టాక్ ను పరిశీలించి రేపటినుండి అంగన్వాడి కేంద్రాలు పనిచేసేలా చర్యలు చేపట్టారు.

చికిత్స కంటే నివారణ మేలు

విశాలాంధ్ర - నిడదవోలు : చికిత్స కంటే నివారణ ఎంతో మేలని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు అధ్యక్షులు కీర్తి ఆంజ నేయులు అన్నారు. నిడదవోలు రొటరీ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాధి నివారణ, వైద్యం అనే కార్యక్ర మంలో భాగంగా సంచార జీవులు, పేదవారు నివాసిత ప్రాంతాల్లో రోటరీక్లబ్ అధ్యక్షులు కీర్తి ఆంజనేయులు పర్యవేక్షణ లో పోలియోవ్యాధి నివారణ పై ఇంటింట ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా 0 నుండి 5 సంవత్సరాలలోపు పిల్లల తల్లులను కలిసి పోలియో పై అవగాహన కలిగించారు. అనంతరం పిల్లలకు పాల సీసాలను ఉచిత పంపిణీ చేసారు.ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పిల్లల జీవితానికి రెండూ చుక్కలు ఓరల్ పోలియో వాక్సిన్ వేయించడం ద్వారా పోలియో వ్యాధి రాకుండా నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ ఎక్స్టెన్షన్ చైర్ గోపిరెడ్డి శ్రీనివాస్, కారింకి సాయి బాబు,ఆకుల ముకుందాం,కాళ్ళ రాంబాబు, గుంటుపల్లి శివకుమార్, పోలాదాసు శ్రీనివాస్, గొన్నాబత్తుల రామారావు,కొత్తపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల నిరవధిక సమ్మెకు వివిధ పార్టీల మద్దతు

విశాలాంధ్ర-పెరవలి : అంగన్వాడీ కార్యకర్తలు పలు డిమాండ్లతో స్థానిక పెరవలి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరవధిక గురువారం సమ్మె చేపట్టారు. ఈశిబిరాన్ని పలు పార్టీలకు చెందిన నాయకులు సందర్శించి, న్యాయమైన డిమాండ్లకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని, గ్రామాల్లో చిన్న పిల్లలు, బాలింతల పర్యవేక్షణ, పరిరక్షణ అంగన్వాడీల పాత్ర వర్ణనాతీతం అని,అటువంటి అంగన్వాడీలకు కనీస వేతనం, భీమాలు కల్పించడం ప్రభుత్వ కనీస బాధ్యత అని అన్నారు. నిరవధిక సమ్మెలో ఉన్న అంగన్వాడీ హెల్పర్స్ వర్కర్స్ ను కాలదన్నుతూ ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్లను బలవంతంగా లాక్కొని, సచివాలయ ఉద్యోగులు మరియు వాలంటీర్ల ఆధ్వర్యంలో నడిపించాలి అనే నిర్ణయం దారుణం అని ఇటువంటి చర్యలకు పాల్పడినందుకు ప్రభుత్వానికి అంగన్వాడీ హెల్పర్స్ వర్కర్స్ తగిన బుద్ధి చెప్పాలని మండిపడ్డారు. ఈకార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: తెలుగు వారందరికీ ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుతూ 58 రోజుల పాటు అమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని ఆంధ్ర ప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 వ తేదీన పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను త్యాగం చేసినట్లు తెలిపారు.అటువంటి మహోన్నత మైన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రజలంతా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిలో పొట్టి శ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు చేసి ఆయన విగ్రహాన్ని ప్రతిష్ట చేయాలని చిన్ని రామ సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావు గౌడ్ డిమాండ్ చేశారు.స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు చేపట్టిన సమ్మె 3వ రోజు మోకాళ్ళపై నిలబడి గురువారం నిరసన తెలిపారు. ఈ సమ్మెకు తెలుగు దేశం పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రామ కృష్ణారావు గౌడ్ మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేయాలని, ఐసిడిఎస్ బడ్జెట్ పెంచాలని, ప్రీస్కూల్స్ బలోపేతం చేయాలని, హెల్పర్ల ప్రమోషన్లో నిబంధనలు పాటించి ప్రమోషన్ వయస్సు 50 సంవత్స రాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆచంట అనిల్ కుమార్, పెద్దిన చంద్రశేఖర్, కాసన్నేని మాధవ రావు, గంధం ముత్తయ్య, పాపా చార్యులు వీరేశలింగం, దాసరి చంద్రశేఖర్, కాసన్నేని వెంకట్రావు, కొక్కిరిగడ్డ బాలస్వామి, మారుమూడి పుణ్యేశ్వర రావు, పలగాని మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీ దొంగల అరెస్ట్

విశాలాంధ్ర-ఆచంట: ఆచంట మండలంలో రైతుల పొలాల్లో పంపు సెట్లు, ఔట్ డోర్ ఏసి యూనిట్లు, వాహనాల బ్యాటరీలను అపహరిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు నరసాపురం ఇన్చార్జి డీఎస్పీ పైడేశ్వరరావు తెలిపారు. గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇంఛార్జ్ డిఎస్పీ పైడేశ్వరరావు వివరాలు వెల్లడించారు. నిందితులు పంట పొలాలలో పంపు చెట్లు, ఏసీ యూనిట్లు, వాహనాల బ్యాటరీలను అపహరిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. గురువారం తమ సిబ్బంది నిందితుల వద్ద నుంచి రూ.3 లక్షల విలువైన పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన ఎస్ఐ రాజ్ కుమార్, సిబ్బందిని అభినందించారు.

అంగన్‌వాడి టీచర్లు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలి

విశాలాంధ్ర-పోడూరు: సేవా భావంతో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు కనీస వేతన చట్టం ప్రకారం ప్రభుత్వం జీతాలు పెంచడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. పోడూరు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో తమ న్యాయమైన కోర్కెల సాధనకై మూడు రోజులుగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలు చేస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరం ను టిడిపి, జనసేననాయకులతో కలిసి గురువారం ఎమ్మెల్యే నిమ్మల సందర్శించి సంఘీభావం వ్యక్తం చేశారు. ఆందోళనకారులతో పాటు కళ్ళకు నల్లటి రిబ్బన్ ధరించి నిరసన వ్యక్తం చేయడంతో పాటు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామానాయుడు మాట్లాడుతూ న్యాయమైన కోరికల సాధనకై తలపెట్టిన పోరాటానికి టిడిపి, జనసేన కూటమి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పోడూరు మండల టిడిపి అధ్యక్షులు గొట్టు ముక్కల సూర్యనారాయణ రాజు, మేడిశెట్టి బుజ్జి, గుడాల ప్రసాద్, జనసేన నాయకులు పీతాని వెంకట్, ఉన్నమట్ల ప్రేమ్ కుమారు తదితర నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె

విశాలాంధ్ర - ముదినేపల్లి : సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మెను ఉధృతం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహంకాళి పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అంగన్వాడీల సమ్మె మూడవ రోజుకు చేరుకున్నాయి. ముదినేపల్లి రెవెన్యూ కార్యాలయం సమీపంలో మండల అంగన్‌వాడీల సమ్మె శిబిరం వద్ద మాజీమంత్రి , బిజెపి నాయకులు కామినేని శ్రీనివాస్ అంగన్వాడీలకు సంఘీభావం తెలిపారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం మొండివైఖరి పరదర్శించి జఠిలం చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పెనుమాల మణి, బండి పద్మ, సూరపనేని అరుణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవరావు, చీకటి సత్యనారాయణ , తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, అంగన్వాడి కార్యకర్తలు , సహాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను మోసం చేయవద్దు

విశాలాంధ్ర-చింతలపూడి: రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు 3వ రోజు సమ్మెలో భాగంగా చింతలపూడి ఫైర్ స్టేషన్ సెంటర్లో నిరసన శిబిరం వద్ద అంగన్వాడీలకు

మాజీ ఐఏఎస్, విజయ పథం దళాధిపతి విజయ కుమార్, ఎన్జీవో పూర్వతాలూకా నాయకులు, తెలుగుదేశం నాయకులు మత్తారెడ్డి, దేవా, జనసేన నాయకులు సిహెచ్. మధుబాబు, ఉపాధ్యాయ సంఘ నాయకులు పి. శ్రీను, కే. దామోదర్, కె. బుచ్చిబాబు పెద్ద ఎత్తున అంగన్వాడి సమ్మె శిబిరం వద్దకు తరలివచ్చి అంగన్వాడీలకు మద్దుతు తెలియజేశారు. అనంతరం అంగన్వాడిలు జగన్ పోస్టర్ ముందు అంగన్వాడీలకు తెలంగాణ కంటే వెయ్యి రూపాయల అధిక వేతనం ఇస్తానన్న హామీని జగన్మోహన్ రెడ్డి నిలబెట్టుకోవాలని మోకాళ్లపై వంగి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కె.మేరమ్మ, బి.తులసి, కె.రేణుక, నాగమణి, వి.కుమారి, యు. యశోద నాయకత్వం వహించారు.

భక్తి భావంతో ఉండాలి

విశాలాంధ్ర-వీరవాసరం: ప్రతిఒక్కరు భక్తి భావంతో ఉండాలని గ్రామానికి చెందిన

రామ భక్తుడు, సన్మాన గ్రహీత చలుమూరి పీర్లు తెలిపారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉన్న సాయిబాబా మందిరంలో గురువారం సందర్భంగా అఖండ అన్న సమారాధనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు కుమ్మరపురుగు సత్యనారాయణ, సరోజిని దంపతుల ఆధ్వర్యంలో సభ్యులు చలుమూరి పీర్లు, సీతామహాలక్ష్మీ దంపతులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి, వస్త్రాలను, పండ్లను బహుకరించారు. కార్యక్రమంలో చామకూరి సూర్యనారాయణ, మోటుపల్లి రాము, నూకల సీతారామానుజం, ఉంగరాల రాంబాబు, వేణు, అరుణ, లక్ష్మీ, ఇతర మహిళా భక్తులు, బాబా సేవకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-మొగల్తూరు: అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు.గురువారం మండలంలోని రామన్నపాలెం గ్రామంలో రాష్ట్ర

ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు , ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. రామన్నపాలెం ఆర్ అండ్ బి రహదారి నుండి లక్కుపేట వరకు రూ. 1. కోటి 15, లక్షలతో నిర్మించిన ఆర్ అండ్ బి రోడ్డు, నరసాపురం ఐస్ ఫ్యాక్టరీ నుండి (వయా పితాని వారి మెరక) సీతారాంపురం ఆర్ అండ్ బి రోడ్డు వరకు రూ.2, కోట్ల 20 లక్షలతో నిర్మించిన రోడ్డు, వంతెన, రూ.21.80 లక్షలతో నిర్మించిన రామన్నపాలెం 2, రైతు భరోసా కేంద్రం, రూ.17.50, లక్షలతో నిర్మించిన రామన్నపాలెం 2, వైయస్సార్ హెల్త్ క్లీన్ సెంటర్, పులపర్తి వారి తోట నుండి పసలదీవి ఆర్ అండ్ బి రోడ్డు వరకు రూ.2 కోట్ల 80 లక్షలతో నిర్మించిన ఆర్ అండ్ బి రహదారి రూ.40 లక్షలతో నిర్మించిన రామన్నపాలెం 1, సచివాలయం రూ.17.50 లక్షలతో నిర్మించిన వైయస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ ప్రారంభించారు. అనంతరం రామన్న పాలెం1. సచివాలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు 30 లక్షల ఇంటి స్థలాలు ఇచ్చి22 లక్షల మందికి ఇల్లు కట్టిస్తూ 17వేల జగనన్న నూతన కాలనీలు నిర్మాణం ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో జరుగుతున్నాయన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జిల్లా పరిషత్ చైర్పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ రామన్నపాలెం స్కూల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ పెంద్ర వీరన్న, ఆర్డీవో అచ్యుత అంబరీష్ జెడ్పిటిసి తిరుమని బాబ్జి, గ్రామ సర్పంచ్ బందిల ఎలీషా, ఎంపీటీసీ అయితం ధనలక్ష్మి, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, కర్రీ ఏసుబాబు, గృహ నిర్మాణ శాఖ ఈ ఈ బి వి రమణ, పంచాయతీరాజ్ ఈ ఈ కె రమాకాంత రావు,పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు బొలిశెట్టి శ్రీనివాస్ మద్దతు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ప్రభుత్వంపై

వ్యతిరేకంగా అంగన్వాడీలు సమ్మెకు పిలుపునివ్వడంతో తాడేపల్లిగూడెం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ స్థానిక తాడేపల్లిగూడెం పట్టణ తాలూకా ఆఫీస్ వద్ద, పెంటపాడు మండలంలో అంగన్వాడీలు చేస్తున్న ధర్నా లో పాల్గొని వారికి మద్దతుగా సంఘీభావం తెలియజేశారు. బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చి నాలుగున్నర సంవత్సరాలు దాటుతున్నా అంగన్వాడీల ఆవేదన సీఎం జగన్మోహన్ రెడ్డి కి అర్థం కాలేదన్నారు. వెంటనే అంగన్వాడీల సమ్మెను ఒక కొలిక్కి తీసుకువచ్చి వారికి న్యాయం జరిగేలాగా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్, పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశీ, మండల అధ్యక్షులు పుల్లా బాబి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతుంది

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉంగుటూరు నియోజవర్గంలో గత మూడు

రోజుల నుండి అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెకు గురువారం పలు రాజకీయ పార్టీలు సంఘీభావం తెలిపాయి. తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగుతుందని అంగన్వాడి కార్యకర్తలు పేర్కొన్నారు. తెలుగుదేశం, కాంగ్రెస్, జనసేన పార్టీలో సమ్మె చేస్తున్న వద్దకు వెళ్లి తమ మద్దతు తెలుపుతున్నారు. ఉంగుటూరు నియోజక వర్గంలో ఉన్న ఉంగుటూరు, భీమడోలు, గణపవరం, నిడమర్రు మండలాలలో దీక్ష చేస్తున్న అంగనవాడి కార్యకర్తలకు, ఆయాలకు టిడిపి మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు వారికి మద్దతు పలికారు.ఈ సందర్భంగా మూడు పార్టీల నాయకులు మాట్లాడుతూ న్యాయపరమైన డిమాండ్లను అమలు చేస్తామని హామీ ఇచ్చారు .కోవిడ్ లాంటి కష్టకాలంలో అత్యంత అవసరమైన సేవలు చేసిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల న్యాయపరమైన కోర్కెలు అమలు చేయాలనిడిమాండ్ చేశారు.ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి హక్కుల పరిరక్షణకై పోరాడుతున్న అంగన్వాడీ వర్కర్లను అరెస్ట్ చేస్తుందని మండిపడ్డారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేసే దిశగా ప్రభుత్వం పనిచేయాలని కోరారు.

అంగన్‌వాడీల సమ్మెకు టీడీపీ సంఘీభావం

విశాలాంధ్ర -భీమవరం: వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ ఉద్యోగులు

భీమవరంలో చేపట్టిన సమ్మెకు టిడిపి మహిళా విభాగం నాయకులు గురువారం సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమ్మె ప్రాంగణం వద్ద అంగన్‌వాడి ఉద్యోగులను ఉద్దేశించి టిడిపి డ్వాక్రా అంగన్ వాడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ మాట్లాడుతూ అంగన్ వాడి ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చని వైసీపీ ప్రభుత్వం నిరసనలు సమ్మెలు చేస్తే ఉద్యోగాల నుండి తొలగిస్తామని బెదిరించడం జగన్ అహంకారానికి నిదర్శనమన్నారు. ప్రతిపక్షనేతగా జగన్ తాను అధికారం లోకి వస్తే వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీలను గాలికి వదిలి అంగన్ వాడి ఉద్యోగులను మోసం చేశారని విమర్శించారు. .తెదేపా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అంగన్‌వాడి ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారానికి చంద్రబాబు దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెదేపా మహిళ విభాగ కార్యనిర్వహక కార్యదర్శి మాదాసు కనకదుర్గ, నర్సాపురం పార్లమెంట్ మహిళా ఉపాధ్యక్షురాలు సయ్యద్ నశిమాబేగం, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఎండి షబీనా, గంధం రాధ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించండి

విశాలాంధ్ర - కలిదిండి: సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ తమ సమస్యలను పరిష్కరించాలని చేస్తున్న

నిరవధిక సమ్మె 3 వ రోజుకు చేరుకుంది. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ నిరవధిక సమ్మెలో సిఐటియు నాయకులు షేక్. అబిదా బేగం మాట్లాడుతూ న్యాయబద్ధమైన తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు సంఘీభావం తెలిపి వారితో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పోకల. జోగిరాజు, మాజీ జెడ్పిటిసి నున్న రమాదేవి, మేడిశెట్టి. సీతారామాంజనేయులు, ముద్దం. భోగేశ్వర రావు, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ పైడిపాటి. శివశంకర్, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలలో విజేతలకు ఎమ్మెల్యే అభినందన

విశాలాంధ్ర - మండపేట : రాజమహేంద్రవరంలో జరిగిన రిలయన్స్ క్విజ్ -2023 పోటీలలో విజేతలుగా నిలిచిన మండపేట గౌతమీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ఎస్ పావని దుర్గ, ఎస్. దీక్షితలను ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అభినందించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం గౌతమీ మున్సిపల్ హైస్కూల్ టీచర్స్ విద్యార్థులతో కలసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసారు. పదవ తరగతి చదువుతున్న యస్. పావని దుర్గ, తొమ్మిదవ తరగతి చదువుతున్న యస్ దీక్షిత ఈ క్విజ్ పోటీలలో మొదటి స్థానం సాధించారని, వీరికి సుమారు రూ.50 వేలు విలువ చేసే రెండు లాప్టాప్‌లను బహుమతులుగా అందజేసినట్లు స్కూల్ టీచర్లు ఎమ్మెల్యేకు తెలియజేశారు. గెలుపొందిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పి.రామచంద్రరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ శోభావళి ఉపాధ్యాయురాలు వి. సూర్యలతలను ఎమ్మెల్యే అభినందించారు.

అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: అంగన్వాడీ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం

వెంటనే పరిష్కరించాలని గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు దేవరపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేస్తున్న అంగన్వాడి టీచర్లు, వర్కర్ల నిరాహార దీక్షా శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో అంగన్వాడీ టీచర్లకు 3500 జీతం పెంచిందని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, ఇతర ఖర్చులు పెరిగాయని, పెరిగిన ఖర్చులకు అనుగుణంగా అంగన్వాడీ టీచర్లకు ప్రభుత్వం 26 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీ వర్కర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సిఐటియు నాయకుడు ఎస్.కె భగత్ మాట్లాడుతూ గత మూడు రోజుల నుండి అంగన్వాడీ టీచర్లు చేస్తున్న ఆందోళన నిరాహార దీక్షలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీ వర్కర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భగత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఉండవల్లి కృష్ణారావు కొత్త గుడి రత్నాజీ తెలుగుదేశం పార్టీ దేవరపల్లి మండల మాజీ అధ్యక్షుడు కొయ్యలమూడి చిన్న బాబు దేశం సీనియర్ నేతలు యాగంటి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: డిసెంబర్ 5వ తేదీన తుపాను వలన ఎస్ ఎల్

ఎస్ ఏరియాలో ముఖ్యంగా దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలో పొగాకు పంట తీవ్రంగా నష్టపోయిందని దేవరపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు కరటూరి శ్రీనివాస్ తెలిపారు. గురువారం శ్రీనివాస్ కేంద్ర పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తుఫాను వలన ఏపుగా పెరిగిన పొగాకు పంటకు నష్టం జరిగిందని, రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. రైతులు ఎంతో పెట్టుబడి పెట్టి పొగాకు నాట్లు వేశారని అన్నారు. పొగాకు ఎదుగుతున్న సమయంలో తుపాను కారణంగా నష్టపోయామని తెలిపారు. తిరిగి పొగాకు వేసుకోవటానికి ఉన్న పొగాకు పంటకు పెట్టుబడి పెట్టుకోవ దానికి రైతులకు అదనంగా రెండు లక్షల రూపాయలు రుణాన్ని మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొగాకు రైతు సంఘం నాయకులు నరహరిశెట్టి సుధాకర్ సింహాద్రి ధర్మావతారం బి. రమేష్ వై శ్రీధర్ తదితరులు అన్నారు.

విద్యుత్ డిమాండ్, సప్లయ్ అంచనాలో ప్రభుత్వ విఫలం

విశాలాంధ్ర - అనపర్తి : విద్యుత్ డిమాండ్, సప్లయ్ అంచనా వేయడంలో రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా విఫలమైందని నియోజకవర్గ బిజెపి కన్వీనర్ శివరామ కృష్ణంరాజు అన్నారు. గురువారం స్థానిక దేవిచౌక్ సెంటర్లో నియోజకవర్గ బిజెపి ఆధ్వర్యంలో వినియోగదారుల పై అదనంగా పడుతున్న విద్యుత్ చార్జీలను నిరసిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శివరామ కృష్ణంరాజు మాట్లాడుతూ నాలు గేళ్లలో 8 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని, మూడు నెలల్లో వినియోగ దారులపై వేసిన అదనపు భారం రూ.700 కోట్ల పైనే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, జిల్లా కిషన్ మార్చా ఉపాధ్యక్షులు గొలుగూరి సత్యనారాయణ రెడ్డి, అనపర్తి, పెదపూడి, రంగంపేట మండల అధ్యక్షులు తాడి గంగిరెడ్డి, కాకి సత్యనారాయణ, సాయిరాం, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పెదపూడి రాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు జవహర్ పరామర్శ

విశాలాంధ్ర - చాగల్లు : కలవలపల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు

కొండేపాటి వెంకటేశ్వర రావును తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి శామ్యూల్ జవహర్ పరామర్శించారు. ఇటీవల వెంకటేశ్వరరావు తండ్రి మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను గురువారం జవహర్ పరామర్శించారు. వెంకటేశ్వరరావును పరామర్శించిన వారిలో కరుటూరి సతీష్, కోడూరి ప్రసాద్, ఆత్కూరి రాంబాబు, ఆత్కూరి సత్యనారాయణ, ప్రత్తిపాటి శశాంక్, పాలడుగుల లక్ష్మణరావు, చావా శ్రీనివాస్, బిక్కిన గోపి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బూరుగుపల్లి వీర రాఘవులు తదితరులు ఉన్నారు.

ఇటీవల ప్రమాదవశాత్తు కాలికి గాయమై విశ్రాంతి తీసుకుంటున్న

చంద్రవరం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మద్దిపాటి వీర రాఘవులను జవహర్ పరామర్శించారు. గురువారం ఆయన జరిగిన సంఘటనపై ఆరా తీసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జవహర్ వెంట అన్నమరెడ్డి బుల్లి రాజు,గారపాటి సత్తిబాబు,ఎంపీటీసీ సభ్యులు గారపాటి నరసింహమూర్తి, సుంకవల్లి మురళి, కరుటూరి సతీష్, పెదవేగి గంగాధర్,చావా శ్రీనివాస్, యనమదల శివయ్య,తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బూరుగుపల్లి వీర రాఘవులు తదితరులున్నారు.

అంగన్‌వాడీల నిరసనలో జనసేన, టిడిపి

విశాలాంధ్ర - సీతానగరం: అంగన్వాడి నిరసనలో పాల్గొన్నారు జనసేన, టీడిపి ఇన్‌చార్జిలు. రాష్ట్రవ్యాప్తంగా గత కొన్ని రోజులుగా సీఎం జగన్ పాదయాత్రలో అంగన్వాడీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నిరసనలు చేపడుతున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా గురువారం మండలంలో సీతానగరం గ్రామంలో గల రెవెన్యూ కార్యాలయం ఎదుట 69 కేంద్రాల అంగన్వాడీ సిబ్బంది టెంటు వేసుకొని తమ నిరసనను తెలియజేశారు. ఈ నిరసనకు రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నా సేన నా వంతు కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి టెంట్ లో కూర్చుని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంగన్వాడీలకు సీఎం జగన్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మట్ట వెంకటేశ్వరరావు, వలవల రాజా, కాండ్రు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంధన వనరులను పొదుపుగా వాడాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : ప్రకృతి ప్రసాదించిన ఇంధన వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా భావితరాలకు అందించడమే కాకుండా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని, ఒక యూనిట్ ఆదా చేస్తే రెండు యూనిట్ల ఉత్పత్తితో సమానమని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అన్నారు. గురువారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకుని కాకినాడ జిల్లా విద్యుత్తు శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఇంధన పొదుపు ఆవశ్యకతపై ప్రజలను చైతన్యపరిచేందుకు చేపట్టిన ర్యాలీని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా జెండా ఊపి ప్రారంభించారు. బాలాజీ చెరువు కూడలి వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యుత్తు ఉద్యోగులు, వినియోగదారులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఇంధన పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం రూపొందించిన ప్రచార కరపత్రాలను కలెక్టర్ ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ.. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 14 నుంచి 20వరకు జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. స్టార్ రేటింగ్ గృహోపకరణాలు వినియోగించడం ద్వారా 25శాతం కరెంటును ఆదా చేయవచ్చాన్నారు. విద్యుత్తును ఆదా చేసేందుకు ప్రస్తుతం మార్కెట్లో అనేక ఎలక్ట్రికల్ ఉపకరణాలు అందుబాటులోకి వచ్చాయని ఆమె తెలిపారు. ఒక యూనిట్ ఆదా చేస్తే రెండు యూనిట్ల ఉత్పత్తితో సమానంఅని.. పర్యావరణ దృష్ట్యా భావితరాల భద్రత కోసం ఇంధనాన్ని పొదుపుగా ఉపయోగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కలెక్టర్ స్పష్టం స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు ఇంధన పొదుపు ఒక సామాజిక బాధ్యతగా తీసుకుని ఈ వారం రోజులు విద్యుత్తు ఆదాపై నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని, అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా ఇంధన పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కాకినాడ విద్యుత్ శాఖ ఈఈ ప్రసాద్ తెలిపారు. విద్యుత్తు పొదుపు వంటి అంశాలపై పాఠశాలల విద్యార్థులకు పెయింటింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు వంటివి నిర్వహిస్తున్నట్లు అయన తెలిపారు. కార్యక్రమంలో పెద్దాపురం ఈఈ ఎ ప్రభాకర్, జగ్గంపేట ఈఈ కె.రత్నాలు, కాకినాడ జిల్లాలోని ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగులు, సీబీఎం కళాశాల విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి కొత్త కియా సోనెట్ వరల్డ్ ప్రీమియర్

విశాలాంధ్ర- తూర్పుగోదావరి : ప్రముఖ మాస్ ప్రీమియం కార్ల తయారీ సంస్థ కియా, భారతదేశంలో మొట్టమొదటిగా అత్యధికంగా అమ్ముడవుతున్న రెండవ ఆవిష్కరణ ది న్యూ సోనెట్ యొక్క కొత్త అవతార్ను పరిచయం చేసినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది 10 స్వయంప్రతిపత్త లక్షణాలతో ఏడీఏస్ఈ ని ప్యాక్ చేస్తుందనీ, వీటిలో ఫ్రంట్ కొలిజన్ అవాయిడెన్స్ అసిస్ట్ లీడింగ్ వెహికల్ డిపార్చర్ అలర్ట్ లేన్ ఫాలోయింగ్ అసిస్ట్ ఉన్నాయన్నారు. బలమైన 15 హై-సేఫ్టీ ఫీచర్లతో కలిపి, సోనెట్ ఇప్పుడు 25 కంటే ఎక్కువ భద్రతా లక్షణాలను కలిగి ఉందనీ వివరించారు. కొత్త సోనెట్ దాని విభాగంలో 15 ప్రామాణిక భద్రతా లక్షణాలను అందించే ఏకైక కాంపాక్ట్ ఎస్ యూ వి అవుతుందనీ ఆశాభావం వ్యక్తం చేశారు. కియా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మరియు సిఈఓ తే-జిన్ పార్క్ మాట్లాడుతూ "సెల్టోస్ను అనుసరించి మా విజయవంతమైన భారతదేశ ప్రయాణంలో సోనెట్ ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. అద్భుతమైన ఫీచర్లు మరియు డిజైన్తో భారతదేశంలో ప్రదర్శించబడి, ఇది సరిహద్దులను అధిగమించి, ఇప్పుడు 100 దేశాలకు ఎగుమతి చేయబడుతోందన్నారు. కొత్త సోనెట్ పరిచయంతో కాంపాక్ట్ ఎస్ యూ వి విభాగంలో అగ్రస్థానాన్ని పొందడం మా ఆశయమన్నారు.

తన కార్యకలాపాలు విస్తరించిన ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ

విశాలాంధ్ర-భీమవరం : భారతదేశంలోని ప్రముఖ హెచ్ఎఫ్సలలో ఒకటైన ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ (ఐసిఐసిఐ హెచ్ఎఫ్సి) తన విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్లోని భీమవరం లో కొత్త శాఖను ప్రారంభించింది. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐసిఐసిఐ హెచ్ఎఫ్స యొక్క 9వ శాఖ. మొత్తం మీద కంపెనీ కి దేశవ్యాప్తంగా 200 కు పైగా శాఖలు వున్నాయి. కంపెనీ స్థానిక కమ్యూనిటీకి విస్తృత శ్రేణి గృహ రుణాలు, గృహ అభివృద్ధి రుణాలు, కార్యాలయ ప్రాంగణం కోసం రుణాలు, గృహ ఈక్విటీ రుణాలు మరియు లోన్ ఎగైనెస్ట్ ప్రాపర్టీ రుణాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కంపెనీ విస్తరణ ప్రణాళికలపై ఐసిఐసిఐ హెచ్ఎఫ్సి యొక్క ఎండి %ఉ% సిఈఓ, అనిరుధ్ కమానీ మాట్లాడుతూ, "మా విస్తరణ వ్యూహంలో భాగంగా, మేము ఉత్సాహపూరితమైన హౌసింగ్ మార్కెట్ ను కలిగి ఉన్న రాష్ట్రాలపై దృష్టి పెడుతున్నాము. నివాసితులు తమ కలల గృహాల కోసం విశ్వసనీయ ఫైనాన్సింగ్ పరిష్కారాలను చురుకుగా వెతుకుతున్నారు. మా పెరుగుతున్న నెట్వర్క్ మరియు విస్తరణ, తమ కలల గృహాలను సొంతం చేసుకోవాలనుకునే కస్టమర్లకు సేవ చేస్తుందని ఆశాభావంతో ఉన్నాము" అని అన్నారు.

అభ్యంతరాల పరిష్కారానికి ఎలక్టోరల్ అధికారులు ప్రత్యేక కృషి : కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 రూపకల్పనలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాపై నమోదైన అభ్యంతరాల పరిష్కారానికి ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్(ఈఆర్వో) అధికారులు ప్రత్యేక కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ డా కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో ఎస్ఎస్ఆర్-2024 కార్యకలాపాలపై జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, ఈఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించి మార్పులు, చేర్పులు, తొలగింపు, అభ్యంతరాల పరిష్కారం, ఈవీఎం స్టోరేజ్ పాయింట్లు గుర్తింపు, ఫారెం 6, 7, 8ల పరిష్కారం, క్లెయిమ్స్ డిస్పోజల్, ఈపీ, జెండర్ రేషియో, టెక్నికల్ సమస్యలు వంటి అంశాలపై కలెక్టర్ ఈ సందర్భంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్-2024 రూపకల్పంలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాపై నమోదైన దరఖాస్తుల పరిష్కారం ఈఆర్వోలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలను తప్పనిసరిగా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ప్రాముఖ్యంగా ఓటు హక్కు వినియోగంపై ఓటర్లను చైతన్య పరచేసేందుకు నియోజకవర్గం వారీగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె శ్రీధర్ రెడ్డి, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్వోలు, ఇతర ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ.37కోట్లతో సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - కాకినాడ : గడచిన నాలుగున్నరేళ్ళలో స్థానిక 20వ డివిజన్‌కు వివిధ

సంక్షేమ పథకాలు ద్వారా ప్రభుత్వం రూ.37 కోట్ల విలువైన లబ్ధిని అందించిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి పేర్కొన్నారు. స్థానిక 20వ డివిజన్ మేకల కబేళా వద్ద గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ప్రదర్శన బోర్డును ఎమ్మెల్యే ద్వారంపూడి ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని అందిస్తున్నామన్నారు. సిటీ నియోజకవర్గంలో 33వేల మందికి ఇళ్ళ పట్టాలు ఇచ్చామని, త్వరలోనే ఇళ్ళ నిర్మాణం కూడా పూర్తిచేస్తామన్నారు. కాకినాడ నగరానికి రూ. 1700 కోట్ల సంక్షేమ పథకాల లబ్ధిని అందించామన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు వెలమల మల్లేశ్వరరావు, కొప్పనాతి నాగసత్యనారాయణ, స్థానిక నాయకులు చిక్కాల సుధ, నరసింహమూర్తి, పలువురు ఆర్ఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ ధర్నా చౌక్ వద్ద అంగన్వాడి కార్యకర్తలు చేస్తున్న

ధర్నాలో తెలుగుదేశం రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వక కార్యదర్శి డాక్టర్ చప్పడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు తెలుగుదేశం పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ఎన్నికల ముందు జగన్ మోహన్ రెడ్డి చేసిన వాగ్దానాలను తక్షణమే అమలు చేసి వారి న్యాయబద్ధమైన కోర్కెలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా పోరాటం చేసే వారి మీద అక్రమ కేసులు బనాయిస్తూ వారిని అరెస్ట్ చేయాలని చూస్తున్నదని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేసారు.